ఆకట్టుకున్న 'సంస్కృత భాషా దినోత్సవం'





సంస్కృత భాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో 'సంస్కృత భాషా దినోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం క్యాంపస్ స్కూల్ సంస్కృత టీచర్ డాక్టర్ లంకపార్థసారథి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత భాషపై విద్యార్థులకు మరింత అవగాహన, ఆసక్తి పెంచేలా శ్లోకాలు, లఘునాటికలు, సంస్కృత గీతాల ఆలాపన తదితర కార్యక్రమాలతో ఆద్యంతం ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. సంస్కృత భాషను వివరిస్తూ విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో క్యాంపస్ స్కూల్ ప్రిన్సిపాల్ పి మురళి మాట్లాడుతూ అన్ని భాషలకు తల్లిభాషగా సంస్కృత భాష గుర్తింపు పొందిందన్నారు. ఒకప్పుడు రాష్ట్ర భాషగా, వ్యవహార భాషగా కూడా గుర్తింపు ఉండేదని గుర్తు చేశారు. కంప్యూటర్‌కు అనుగుణమైన ఏకైక భాష సంస్కృత భాష, మన సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్కృత భాషలోని నిక్షిప్తమై ఉన్నదని ఇలాంటి తల్లి భాషను మనం మర్చిపోకూడదన్నారు. శ్లోకాలు, లఘునాటికలు, సంస్కృత గీతాల ఆలాపన చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి



వయనాడ్‌కు మందులను తరలిస్తున్న రవికుమార్‌యాదవ్, తదితరులు

రాయదుర్గం: దేశంలో ఎక్కడా ఎలాంటి విపత్తులు వచ్చినా బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం స్వామి వివేకానంద మెడికల్ మిషన్ ద్వారా వయనాడ్ వరద బాధితులకు స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు నందనం విష్ణుదత్ ఆధ్వర్యంలో మసీదు బండ నుంచి ప్రత్యేక వాహనంలో మందులను పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశం, మన ప్రజలు అనే భావనతో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నారు. వరదలతో సర్వం కోల్పోయిన వారికి తమ వంతు చేయూత అందించేందుకు అందరూ స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. వయనాడ్ బాధితులకు ఔషధాలు అందించేందుకు చొరవ చూపిన, విష్ణు, త్రివేణి విద్యాసంస్థలు, లేపాక్షి కళాశాల యాజమాన్యాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో విజయ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ బ్లాక్ డే నేపథ్యంలో విద్యార్థుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

చందానగర్: గ్లోబల్ బ్లాక్ డే సందర్భంగా గంగారం సుమన్ కళాశాలలో మహిళా దక్షత సమితి విద్యాసంస్థలు, సుమన్ బాలికల జూనియర్ కళాశాల, విడి బజాజ్ మహిళా డిగ్రీ కళాశాల, బన్సీలాల్ మలానీ నర్సింగ్ కళాశాలల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోలకతాలో ఈ నెల 9న ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యానికి నిరసగా నల్లని వస్త్రాలు ధరించి మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలపై నిరసన తెలుపుతున్నామన్నారు. ఒక డాక్టర్‌కే రక్షణ లేనప్పుడు తమ లాంటి ఆడపిల్లలకు ఎక్కడ రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమాకుమారి, సుశీల పాటిల్, కళాశాల విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: నియోజకవర్గంలో పురాతన ఆలయాల జీర్ణోద్ధారణకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో కల్యాణ సీతారామ స్వామి దేవాలయ జీర్ణోద్ధారణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా పరమత సహనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. పదేళ్లలో నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 200కు పైగా దేవాలయాలు నిర్మించడంతో పాటు 100కు పైగా మసీదులు, చర్చిలు నిర్మించి ప్రతి ఒక్కరిలో దైవ చింతనను పెంపొందించామని వివరించారు. భవిష్యత్‌లోనూ దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.

అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

- ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
- చందానగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో సమీక్ష

చందానగర్: అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. బుధవారం ఆయన చందానగర్ డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు, భవానీపురం కాలనీ నాలా, కేఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్ కాలనీ, అపర్ణ లింక్ రోడ్డు నిర్మాణ పనులపై జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డీసీ రజినీకాంత్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఎన్నో ఏళ్ల సమస్య నేటితో తీరనుందని, ప్రజల సౌకర్యార్థం, ప్రజావసరాల దృష్ట్యా రోడ్డు విస్తరణ చేపడుతున్నామన్నారు. విద్యుత్ స్తంభాలను మరో చోటికి మార్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని హంగులతో రోడ్డు విస్తరణ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు రూ.కోట్లు వెచ్చించి అనేక ఫ్లైఓవర్లు, రోడ్లు, లింక్ రోడ్డు పూర్తి చేశామన్నారు. డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ రోడ్లు నిర్మించాలని కోరారు. వీటిని ప్రత్యేకంగా తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల ట్రాఫిక్ కష్టాలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పలు కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ కేవీఎస్ రాజు, డీఈలు శిరీష, దుర్గ ప్రసాద్, స్రవంతి, ఏఈ సంతోష్‌రెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ రవికుమార్, వీధి దీపాల ఈఈ మల్లికార్జున్, టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసీపీ నాగిరెడ్డి, టీపీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, అవినాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభం



గంగారం చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గంగారం పెద్ద చెరువులో సుందరీకరణలో భాగంగా చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డీసీ రజినీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు తుది దశలో ఉన్నాయన్నారు. చెరువు చుట్టుపక్కల ప్రజల విజ్ఞప్తి మేరకు గుర్రపు డెక్క తొలగింపుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పనులను త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గుర్రపు డెక్క తొలగింపుతో దోమల బెడద తగ్గుతుందన్నారు. చెరువు కట్ట పటిష్టం, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక మురుగు కాలువ నిర్మాణం, అలుగు మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సంరక్షణలో భాగంగా చెరువు చుట్టు కంచె నిర్మిస్తామన్నారు. ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ కెవిఎస్ రాజు, డీఈలు శిరీష, దుర్గ ప్రసాద్, స్రవంతి, ఏఈ సంతోష్‌రెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ రవి, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

పటాన్‌చెరు టౌన్: గ్రామ పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతుల మేరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని ఇంద్రేశం గ్రామ కార్యదర్శి సుభాష్ అన్నారు. అలా కాకుండా ఇష్టారాజ్యంగా ఇల్లు కడితే కఠిన చర్యలు తప్పవ న్నారు. బుధవారం మండల పరిధిలోని ఇంద్రేశంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్న ఏడు భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసులు జారీ చేసిన వినకుండా ఇష్టారాజంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు చేపడతామని హెచ్చరించారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ సింధు అధికారులను కోరారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో సీసీ రోడ్డు వేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీ, పైపులైన్‌కు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. డివిజన్ అభివృద్ధిలో ముందుందని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

చెరువుల పరిరక్షణకు చర్యలు: ఎమ్మెల్యే గాంధీ



గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: చెరువుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం ఆయన మియాపూర్‌లోని పటేల్ చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చేపట్టిన గుర్రపు డెక్క పనులను జోనల్ కమిషనల్ ఉపేందర్ రెడ్డి, డీసీ రజినీకాంత్ రెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పటేల్ చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులు తుదిదశలో ఉన్నాయన్నారు. గుర్రపు డెక్కను తొలగిస్తే దోమల బెడద తగ్గుతుందని పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరించి అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన వాతావరణం ప్రజలకు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ పావని, జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ రాజు, డీఈ శిరీష, దుర్గా ప్రసాద్, శ్రవంతి,ఏఈ సంతోష్ రెడ్డి, నాయకులు రఘునాథ్‌రెడ్డి, సందీప్ రెడ్డి, అవినాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా టీకా వేయించుకోవాలి



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ వార్డు కార్యాలయంలో జపనీస్ ఎన్సెఫాలిటిస్‌కి వ్యతిరేకంగా మెదడు వాపు వ్యాధి రాకుండా చిన్నారులకు బుధవారం టీకాలు వేశారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా టీకాలు వేయించాలని తెలిపారు. సమ్మారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రవికుమార్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బోరు ఏర్పాటు

శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోరును డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నీటి కొరత లేకుండా ఉంటుందని తెలిపారు. సమ్మారెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి. నరసింహులు, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం. సుందరరావు, జి. నరసింహులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 25, పచ్చిమిర్చి 60, బెండ 35, కాకర 40, దొండ 35, దోస 30, ఆలు 40, చామ 50, కీర 35, బీర 40, వంకాయ 30, గోకర 40, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 60, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 280.

కొరివి కృష్ణస్వామి ముదిరాజ్‌సేవా సమితి అధ్యక్షుడిగా నరేందర్



రాయదుర్గం: కొరివి కృష్ణస్వామిముదిరాజ్ సేవా సమితి శేరిలింగంపల్లి అధ్యక్షుడిగా నీలం నరేందర్‌కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు తొండెటి సత్యం ముదిరాజ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ సమితి రాజకీయ పార్టీ కాదని, కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితమన్నారు. విద్యా, వైద్య, ఉపాధి, విగ్రహావిష్కరణ లక్ష్యాలుగా సమితి పనిచేస్తుందని తెలిపారు. శేరిలింగంపల్లి ప్రాంతంలో పలు కార్యక్రమాలను చేపట్టేందుకు తగిన చొరవ తీసుకుంటామన్నారు. రాష్ట్ర స్థాయి కార్యవర్గంతోపాటు 119 నియోజకవర్గాల అధ్యక్షులు, ఇన్‌చార్జీలను నియమించినట్లు తెలిపారు.

బీజేపీలో చేరిక



బీజేపీలో చేరిన వారితో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలి డివిజన్, గోపన్‌పల్లికి చెందిన నాయకులు మునియప్ప, శంకర్, రాజు, మానస్, కరుణాకర్, విఠల్ ఆధ్వర్యంలో పలువురు యువకులు బుధవారం బీజేపీలో చేరారు. గంగాధర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను చూసి పలువురు బీజేపీలో చేరుతున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో కేంద్ర ప్రభుత్వం అందరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతున్న బీజేపీ ఎదుర్కొనే సత్తా ఏ పార్టీకి లేదన్నారు. బీజేపీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కొత్త, పాత నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్య క్రమంలో నాయకులు శేఖర్, రమేష్, రాజు, గోపాల్, ప్రభాకర్, సురేష్, రాజు, నగేష్, వెంకట్, మణి, శ్రీకాంత్, వినయ్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను బుధవారం ఆమె నివాసంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి పలు విషయాలపై చర్చించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలపై సమావేశం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ యాదగిరి

పటాన్‌చెరు: గుమ్మడిదల మండల స్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్ విద్యార్థుల ఎంపిక సమావేశాన్ని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంఈఓ జెమినీ కుమారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలకు అధికారులు పలు సూచనలు చేశారు. గ్రామంలోని శ్రీ వివేకానంద పాఠశాలలో ఈనెల 28, 29లో అండర్ 14, 17 విద్యార్థుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు విద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రాంబాబు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పీఈటీలు, పీడీలు, సీఆర్పీలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పటాన్‌చెరు టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో యాదగిరి సూచించారు. బుధవారం మండల పరిధిలోని నందిగామలో జరుగుతున్న ఇంటింటి ఫీవర్ సర్వేలో గ్రామ కార్యదర్శి రాజేందర్ పాటిల్‌తో కలిసి ఎంపీడీఓ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బంది పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్వామి చిదాత్మానంద ప్రవచనాలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ రాయల్ గార్డెన్‌లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు విజయ రహస్యంపై స్వామి చిదాత్మనంద ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయం సాధించడానికి ఏది అవసరం , అదృష్టమా? లేక దేవుడా? అనే విజయ రహస్యంపై స్వామి చిదాత్మానంద ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. మూడు రోజులు పాటు ప్రతి రోజు సాయంత్రం7 నుంచి 8 గంటల వరకు ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు.

యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో వివిధ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తూ గడుపు తేదిని ఈ నెల 29 వరకు పొడిగించారు. విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు బైపీసీ స్ట్రీమ్ కోర్సుల్లో దరఖాస్తు చేసుకునే తేదిని పెంచినట్లు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి రఘురామిరెడ్డి తెలిపారు. ఈ గడువు ఆగస్టు 17వరకు ఉండేదని, చాల మంది విద్యార్థులు వివిధ కారణాల వలన దరఖాస్తులు చేసుకోని కారణంగా ఈ గడువును పెంచినట్లు తెలిపారు. తొలివిడుతలో దరఖాస్తూ చేసుకోని వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సెట్‌ను చూడాలని తెలిపారు.

శాంతినగర్ పార్కులో ప్రశాంతత కరువు



చందానగర్ శాంతినగర్‌లోని ట్రీ పార్కు ఇదే..



పార్కులో చెత్తా చెదారం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ట్రీ పార్కు
- నిరుపయోగంగా మారిన సౌకర్యాలు
- పట్టించుకోని అధికారులు

చందానగర్: ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాల్సి పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారి ప్రశాంతత లేకుండా చేస్తున్నాయి. చందానగర్ శాంతినగర్‌లోని జీహెచ్‌ఎంసీ ట్రీ పార్కులో పచ్చదనం కొరవడటంతో నిరుపయోగంగా మారింది. పార్కులు అభివృద్ధిలో భాగంగా పార్కులో వాకింగ్ ట్రాక్, టాయిలెట్లు, సిమెంట్ కుర్చీలు ఏర్పాటు చేశారు. అయితే పచ్చగా కళకళలాడాల్సిన పార్కు ఇప్పుడు చెత్త చెదారంతో పాటు ఎడారిని తలపిస్తోంది. చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆటవస్తువులు విరిగిపోయాయి. వాకింగ్ ట్రాక్ పూర్తిగా ధ్వంసం కావడంతో వాకర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ఆకతాయిలు పార్కులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం సేవించి పార్కులోని వస్తువులను ధ్వంసం చేస్తున్నారన్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

సమస్యలు ఇవీ..

- పార్కులో పిచ్చిమొక్కలను తొలగించాలి.
- పార్కులో పచ్చదనం ఏర్పాటు చేయాలి
- వాకింగ్ ట్రాక్, చిన్నారులు ఆటలు ఆడుకోవడానికి ఆట వస్తువులను ఏర్పాటు చేయాలి
- కొత్త సిమెంట్ కుర్చీలు ఏర్పాటు చేయాలి
- పార్కు అభివృద్ధి కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలి
- టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలి



ధ్వంసమైన సిమెంట్ కుర్చీలు



నిరుపయోగంగా మారిన టాయిలెట్స్

పార్కును అభివృద్ధి చేయాలి



జీహెచ్‌ఎంసీ ట్రీ పార్కును పట్టించుకునే వారు కరువయ్యారు. పార్కులో పచ్చదనం లేక ఎడారిలాగా మారింది. పార్కులో అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలి. జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటికైన పార్కులో పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలి.

– పవన్, శాంతినగర్

ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలి



శాంతినగర్‌లోని ట్రీ పార్కు ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో మద్యం సేవించి పార్కులో ఉన్న సిమెంట్ కుర్చీలను ధ్వంసం చేస్తున్నారు. టాయిలెట్లను అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారు. పార్కులోకి వాకింగ్‌కు రావాలంటే కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆకతాయిలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– సాయి, శాంతినగర్ వాసి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల ఆత్మహత్య

క్రైం కార్నర్..

అప్పులు తీర్చే దారి లేక..

చందానగర్: అప్పులు తీర్చేదారి లేక ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన వరలక్ష్మి (34), సత్య శివ ప్రసాద్ చందానగర్‌లోని కైలాశ్‌నగర్‌లో ఉంటూ నగరంలోని పీఎస్‌ఆర్ ల్యాబ్‌లో పని చేస్తున్నారు. కుటుంబ ఖర్చుల నిమిత్తం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికిలోనైన వరలక్ష్మి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త సత్య శివ ప్రసాద్ సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భర్తతో గొడవపడి..

భర్తతో గొడవ పడి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. లింగంపల్లి వెంకట్‌రెడ్డి కాలనీలో నాగమల్లేశ్వరరావు విజయ (40) దంపతులు నివాసం ఉంటున్నారు. తరచూ వీరి మధ్య గొడవలు జరుగుతుండేవి. మంగళవారం గొడవ జరగడంతో మనస్తాపానికిలోనైన విజయ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. అదే సమయంలో చొక్కా తీసుకునేందుకు గదిలోకి వెళ్లిన నాగమల్లేశ్వర్ రావు భార్య ఉరికి వేలాడుతుండటాన్ని గుర్తించాడు. స్థానికుల సహాయంతో ఆమెను కిందకు దింపి చికిత్స కోసం చందానగర్‌లోని పీఆర్‌కె ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాద మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం



సోనియా బాయి (ఫైల్)

చందానగర్: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నారాయఖేడ్‌కు చెందిన జ్ఞానేశ్వర్, సోనియా బాయి దంపతులు లింగంపల్లి తారానగర్‌లో ఉంటూ గప్‌చుప్ బండి నడుపుకుంటున్నారు. మంగళవారం ఉదయం భర్తతో గొడవ పడిన సోనియా బాయి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లింది. ఆమె కోసం గాలించినా ఆచూకీ లభించకపోడవంతో ఆమె భర్త జ్ఞానేశ్వర్ చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.